సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 13 । జనవరి । 2025



ఏపీజీబీని తరలించొద్దు

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించవద్దని రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. -10లో



కర్ణాటక సరిహద్దులో రోడ్డు ప్రమాదం

ఏపీ, కర్ణాటక సరిహద్దులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, కడపకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. -10లో

గరిష్టం/కనిష్టం
29.8/19.4

వాతావరణం

జిల్లాలో ఆదివారం 19.4 - 29.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రతి గడప శోభాయమానంగా వెలుగొందాలి



కడప కార్పొరేషన్: సంక్రాంతి సందర్భంగా జిల్లాలో ప్రతి గడప సంక్షేమ, సౌభాగ్యాలతో వెలుగొందాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. భోగ, భాగ్యాల భోగి ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు నింపాలని, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆయన కోరారు. మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సుఖశాంతులతో వర్ధిల్లాలని, కనుమ పండుగతో పల్లె సీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని కోరారు.

- పల్లెల్లో ప్రతి ఇంట సుఖసంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సంతోషంగా జరుపుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: సంక్రాంతిని జిల్లా అంతటా సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సప్తవర్ణ శోభితం.. పుష్పయాగం



శ్రీ సీతారాములకు పుష్పయాగం

కడప కల్చరల్: కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ కోదండ రామస్వామికి ధనుర్మాసం సందర్భంగా ఆదివారం వైభవోపేతంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా అలంకరించారు. భక్తులు ప్రాతఃకాల ఆరాధన, విష్ణు సహస్రనామ పారాయణం, పాశురాలను ఆలపించారు. అనంతరం దేవతామూర్తులను పల్లకీపై కొలువుదీర్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు దాదాపు 25 రకాల పుష్పాలను సమర్పించి అర్పించారు. దీంతో పుష్పయాగం సప్తవర్ణ శోభితంగా కొనసాగింది.

నేడు గోదాదేవి కల్యాణం

వల్లూరు : పుష్పగిరిలో భోగి పండుగ నాడైన సోమవారం గోదా దేవి కల్యాణం వైభవోపేతంగా జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఈవో శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి బిందె తీర్థ సేవ, అనంతరం సహస్ర నామార్చన, ధనుర్మాస ఆరాధన జరుగుతాయని వారు పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 10 గంటలకు గోదా దేవి కల్యాణోత్సవం జరుగుతుందని వివరించారు.

'ఆకాశాన్నంటిన ధరలు'



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో పప్పు, ఉప్పు, కందిపప్పు, బియ్యం, నూనె వంటి నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని నగర మేయర్ సురేష్‌బాబు విమర్శించారు. ఆదివారం స్థానిక 23వ డివిజన్‌లో కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో 500 మందికి సంక్రాంతి కానుకగా కందిపప్పు, బియ్యం, గోధుమపిండి, బెల్లం, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఓ వైపు జనం అల్లాడుతుంటే.. మరోవైపు ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచి వారి నడ్డి విరుస్తోందన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ప్రజలకు డబ్బు అందేదని, ఫలితంగా వారు ఇలాంటి పండుగలను ఎంతో ఘనంగా నిర్వహించుకునే వారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనందున ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయిందని, పండగ కళ తప్పిందని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామక్రిష్ణారెడ్డి, రెడ్డి ప్రసాద్, సుబ్బరాయుడు, రహీం తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన పల్లె



కనిపించని సంక్రాంతి సందడి

- భోగి వేడుకకు ధరల మంట
- ఊసే లేని పండుగ సంప్రదాయాలు
- ప్రభుత్వ పక్షాన సంబరాలు మాయం
- ఆరుగాలం శ్రమించినా ఫలితం లేదంటున్న రైతన్నలు
- చంద్రన్న కానుక అందివ్వడంలో కూడా రిక్తహస్తమే



రచ్చబండపై మాట్లాడుతున్న అనిమెల గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి కడప: సంక్రాంతి అంటే సంబరాలు.. సందడి. గ్రామాలు భోగ భాగ్యాలతో తులతూగే పర్వదినం. మూలాలు మరవకుండా ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా బంధుమిత్రులను కలుసుకునేందుకు, తాము పుట్టిన ఊర్లను పలుకరించేందుకు తరలివచ్చే వేడుక. ఈ ఏడాది పరిస్థితి అలా కనిపించడం లేదు. పట్టణాలు, నగరాల్లో హడావుడి ఉన్నా.. పల్లెలు మాత్రం దిగాలు పడి నీరసించి కనిపిస్తున్నాయి. ఎప్పుడూ లేనంత దైన్యం అన్ని వర్గాల ప్రజల్లో నెలకొంది. ఏడాదంతా ఎదురుచూసి కూడా పండుగను తనివితీరా నిర్వహించుకోలేని పరిస్థితి. మునుపటిలా చేతిలో పైసలు ఆడకపోవడంతో దైన్యం మినహా గ్రామీణులు పండుగ అట్టహాసంగా చేసుకునే ధైర్యం చేయడం లేదు.



- మూడు రోజుల పెద్ద పండుగ ఈ ఏడాది సగటు జీవికి చేదు జ్ఞాపకాన్నే మిగల్చనుంది. పొద్దున్నే లేచి భోగి మంటలతో ఆనందించాలనుకున్నా అంతకు మించి ధరల మంటలు భయపెడుతుండడంతో కనీస ఉత్సాహం కరువైంది. రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దే మహిళలకు కూడా నిన్నటివరకు అందిన పథకాల పైసలు ఆగిపోయి దిగులు పోటుచేసుకున్నది. దీంతో పండుగ మాటంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. అదే విషయాన్ని వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామస్తులు వివరిస్తున్నారు. సంక్రాంతి పండుగ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించేందుకు వెళ్లిన 'సాక్షి ప్రతినిధి' అనిమెల గ్రామస్తులను పలుకరిస్తే తమ ఆవేదన వెలిబుచ్చారు. పంటల పెట్టుబడుల ఖర్చులకు కూడా సరిపడా దిగుబడి లేదని రైతు జయరామిరెడ్డి వాపోయారు. 'గత ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలిచింది. పెట్టుబడి అవసరానికి అనుగుణంగా రైతు భరోసా ఇచ్చేది. మద్దతు ధరల కోసం ప్రత్యేకంగా పర్యవేక్షించేది. విపత్తుల్లో సైతం వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించేది' అని శివలింగారెడ్డి అనే రైతు వివరించారు. అవన్నీ ఇప్పుడు మాయమయ్యాయని వారు అభిప్రాయపడ్డారు.

రైతన్నకు ప్రోత్సాహం కరువు

సంక్రాంతిని పల్లెల పండుగగా పేర్కొంటారు. అధిక దిగుబడులు సాధించిన రైతులను ఈ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రానికి ఆహ్వానించి అధికారులు వారిని ఘనంగా సత్కరించి ఉత్తమ రైతు అవార్డులను అందించి ప్రోత్సహించేవారు. ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న రైతులు రెట్టించిన ఉత్సాహంతో మరింత దిగుబడి సాధించేందుకు కష్టించేవారు. పట్టణాలు, నగరాలకు అన్నం పెట్టే అన్నదాతకు అవార్డు సంగతి అటుంచితే.. కనీస గుర్తింపు, గౌరవాలు కూడా కరువు కావడం రైతును మరింత నిరాశకు గురిచేస్తోంది. ఇలాంటి స్థితిలో ఆదుకునే భరోసాను కూడా విస్మరించింది. ప్రత్యామ్నాయంగా ఇతర సాయాలతో భరోసాగా నిలుస్తుందని ఆశించిన రైతన్నకు నిరాశే మిగిలింది. మొత్తంపై ఈ సంక్రాంతి సందర్భంగా పల్లెలు కళ తప్పి, చేతుల్లో కాసులు లేక పండుగ సంబరాలకు దూరంగా ఉన్నాయి.



దూరం.. భారం

ఈసారి అంతో ఇంతో కష్టానికి ఫలితం దక్కుతుందన్న సమయంలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోలేక, తడిచిన ధాన్యానికి ధర లేక రైతన్న కుదేలయ్యాడు. ఇతర పనులు చేసుకుని కాలం గడుపుదామన్నా నీవు పచ్చ పార్టీ కాదంటూ చేతిలోని ముద్ద లాక్కునేవారే ఎక్కువయ్యారు. చేసేది లేక పండుగ నాడు కూడా గ్రామీణులు పస్తులకు సిద్ధమయ్యారు. స్వస్థలాలకు చేరుకోవాలనుకున్నా ఆర్టీసీ సైతం తమవంతుగా అంతో ఇంతో చార్జీల వడ్డింపు చేపట్టింది. ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు నగరాల నుంచి వచ్చేందుకు ఒక్కొక్కరికి కనీసం రూ.2000 పైగా వసూలు చేస్తున్నారు. వీటిపై ఏమాత్రం నియంత్రణ లేకపోవడంతో తప్పనిసరి అయిన వారు ఖర్చు చేయక తప్పడం లేదు. గత ఏడాది వరకు సంక్రాంతి సంప్రదాయాలలో ప్రధానమైన ముగ్గుల పోటీలు విస్తృతంగా జరిగాయి. ఈ ఏడాది అలాంటి పోటీలు నిర్వహించేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకు రాలేదు. వ్యాపారాలు లేవంటూ వారు వెనకడుగు వేయడంతో మొక్కుబడిగా నిర్వహించడం తప్ప సంక్రాంతి ముగ్గులు కళకళలాడలేదు. ఇక సంక్రాంతి ప్రత్యేకంగా పిండి వంటలు వేసుకుందామంటే ధరల మంట భయపెడుతోంది. అవసరానికి అడ్డంగా... అన్నట్లు దుకాణాలలో కొని పబ్బం గడిపే ధోరణి నెలకొంది. పండుగ సంప్రదాయాలలో భాగంగా విస్తృతంగా కన్పించే హరిదాసులు కరువయ్యారు. గంగిరెద్దుల గురించి చెప్పాల్సిన మాటే లేదు. పల్లెల్లో సైతం ఎద్దుల సందడి కనిపించడం లేదు.

సంక్షేమం లేదు.. కానుకల్లేవు

సూపర్ సిక్స్ పథకాలంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. తల్లికి వందనం ఏడాదికి రూ.15 వేలు, ప్రతినెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు, రైతుకు సాయం ఏడాదికి రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి ప్రతి నెలా రూ.15 వందలు ఇవేవి అమలు కాలేదు. జిల్లా వ్యాప్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా 9,82,554 మందికి 27 ప్రభుత్వ పథకాల ద్వారా రూ.8,857.42 కోట్ల నగదు చేరింది. ఒక్క అనిమెల గ్రామానికే సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రూ.1.8 కోట్లు లభించింది. అంటే సుమారు ప్రతి ఏడాది ఆ గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.36 లక్షలు వచ్చి చేరేది. వైఎస్ జగన్ సర్కార్ ప్రోత్సాహంతో గ్రామీణుల వద్ద డబ్బు రోటేషన్ ఉండేది. పంటల పెట్టుబడుల తోపాటు పండుగ నిర్వహణ ఆనందంగా చేసుకునేవారు. రెండు వేల ఐదు వందల జనాభా ఉన్న ఆ గ్రామంలో ప్రస్తుతం సంక్రాంతి కళ తప్పింది. పండుగకు చంద్రన్న కానుకలు అందిస్తామని ఇచ్చిన హామీ కూడా నిలుపుకోకపోవడం, ఆర్థికంగా నీరసించి పోయిన గ్రామీణుల్లో పండుగ కళ తప్పింది.

ఉపాధి అవకాశాలు లేవు



ప్రస్తుత ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు మరుగున పడ్డాయి. యువతకు ఇచ్చిన హామీ అమలు చేయలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

- శంకర్‌రెడ్డి, నిరుద్యోగి, అనిమెల

నామమాత్రంగా పండుగ



పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక సంక్రాంతిని సంబరంగా చేసుకోలేక పోతున్నాం. ఈ ఏడాది గ్రామాల్లో పండుగ కళ లేదు. రైతుల ముఖాల్లో చిరునవ్వు కరువైంది. పిల్లల కోసం నామమాత్రంగా పండుగ నిర్వహించుకోవాల్సి వస్తోంది.

- శివలింగారెడ్డి, రైతు, అనిమెల


పథకాల అమలులో విఫలం



సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమయింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అందించారు.

- గోపాల్‌రెడ్డి, గ్రామస్తుడు, అనిమెల

అక్కడి ఆచారం.. సంక్రాంతికి దూరం



సంక్రాంతి పండుగ జరుపుకోని టి.పసలవాండ్లపల్లె



శ్రీపల్లావలమ్మ తల్లి ఆలయం

- 18 ఊళ్లలో ఊసే లేని పండుగ
- శ్రీపల్లావలమ్మ ఆజ్ఞను పాటిస్తున్న ఆయా గ్రామస్తులు
- కలసికట్టుగా కట్టుబాట్లు అమలు

గుర్రంకొండ: సంక్రాంతి విశిష్టత.. ఆ పండుగ సందడి గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే అలాంటి పర్వదినానికి కొన్ని గ్రామాలు కొన్నేళ్ల నుంచి దూరంగా ఉంటున్నాయి. ఇది అక్కడి ఆచారంగా కొనసాగుతుండటం గమనార్హం. ఇలాంటి పల్లె సీమలు అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో 18 ఉన్నాయి. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని.. ఆ గ్రామాల వాసులు ఆధునిక కాలంలో కూడా పాటిస్తుండటం విశేషం. ఎప్పుడో పెద్దలు ఏర్పాటు చేసుకొన్న కట్టుబాట్లను కలసికట్టుగా అమలు చేస్తుండటం వారి ప్రత్యేకత.

మార్చిలో ఉత్సవాలే వారికి సంక్రాంతి

మండలంలోని మారుమూల టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో 18 గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల వాసులందరూ కలిసి టి.పసలవాండ్లపల్లెలో ఉన్న శ్రీ పల్లావలమ్మ అమ్మవారిని గ్రామదేవతగా కొలుస్తారు. ఏటా మార్చిలో నిర్వహించే గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ జాతర ఉత్సవాలే ఇక్కడి ప్రజలకు సంక్రాంతి పండుగ. శ్రీ పల్లావలమ్మ ఆజ్ఞానుసారం ఈ పర్వదినం జరపకూడదంటూ పూర్వకాలంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. వారి ఆదేశాలనే నేటికీ పాటిస్తున్నారు.

పాడి ఆవులతో వ్యవసాయం నిషేధం


పాడి ఆవులపై ఎంతో ప్రేమ కలిగిన ఈ గ్రామాల్లో.. పాడి ఆవులతో వ్యవసాయం చేయడం నిషేధం. సాధారణంగా రైతులు ఇప్పటికీ చాలా గ్రామాల్లో పాడిఆవులతో వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఈ 18 గ్రామాల్లో మాత్రం పాడిఆవులతో వ్యవసాయ పనులు చేయరు.



గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించే సంస్కృతి ఇక్కడ ఎప్పటి నుంచో కొనసాగుతుండటం విశేషం. పూర్వపు తమ పెద్దల ఆచారం ప్రకారమే ఈ సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు.

గ్రామంలో కొన్ని పశువులను గ్రామదేవత పల్లావలమ్మ పేరుమీద వదిలేసి కొందరు వాటిని మేపుతుంటారు. వాటిలో ఆవులను అమ్మవారి ఉత్సవాల రోజున అందంగా అలంకరించి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. అక్కడ వాటికి భక్తిశ్రద్ధలతో అందరూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే వారికి సంక్రాంతి పండుగ.

ఆచారాలను మరువబోం



మా పూర్వీకులు ఆచరించిన ఆచారాలను మరవబోము. గ్రామ దేవత శ్రీపల్లావలమ్మ ఉత్సవాల రోజున అమ్మవారి ఆవులను ఆలయం వద్దకు తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తాం. అదే మాకు సంక్రాంతి. -బ్రహ్మయ్య, ఆలయ పూజారి, బత్తినగారిపల్లె

పూర్వీకుల అడుగుజాడల్లో..



పూర్వీకుల సంప్రదాయాన్ని గౌరవిస్తూ నేటికీ వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నాం. మా ప్రాంతంలోని 18 గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోబోము. మా పెద్దోళ్ల కాలం నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. ఈ సంస్కృతిని ముందు తరాల వారు కూడా పాటిస్తారని నమ్ముతున్నాం. - కరుణాకర్, టి.గొల్లపల్లె, టి.పసలవాండ్లపల్లె పంచాయతీ

క్లుప్తంగా

రూట రాష్ట్ర కన్వీనర్‌గా ముహమ్మద్ ఇర్షాద్



కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) విద్యా సదస్సుల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా ముహమ్మద్ ఇర్షాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు రూట రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అబ్దుల్ మునాఫ్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

108 వాహనంలో మహిళ ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన మహిళతో పాటు బిడ్డను చూపుతున్న వాహన సిబ్బంది

వల్లూరు : మండలంలోని పెద్దపుత్తకు చెందిన తుమ్మల సుధామణి ఆదివారం 108 వాహనంలో మగ బిడ్డను ప్రసవించింది. తుమ్మల శంకర్ భార్య సుధామణి మొదటి కాన్పుకోసం పెద్దపుత్తలోని ఆమె తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. సోమవారం ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో బంధువులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో వాహన సిబ్బంది పెద్దపుత్తకు వెళ్లి ఆమెను అంబులెన్స్‌లో ఎక్కించుకుని ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో వాహనంలోనే మగ బిడ్డను ప్రసవించింది. వాహన సిబ్బంది ఆమె సులువుగా కాన్పు కావడానికి సహకారం అందించారు. తల్లీ బిడ్డ సురక్షితంగా ఉన్నారని, వారిని కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు వాహన సిబ్బంది తెలిపారు.

తిరుగు ప్రయాణానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేకంగా బస్సులను నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని కడప, బద్వేలు, మైదుకూరు, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు డిపోల నుంచి సాధారణ చార్జీలతో బస్సులను నడుపుతున్నామన్నారు. ఇప్పటికే వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. హైదరాబాదుకు 100, బెంగళూరు 70, విజయవాడ 25, చెన్నై 15, ఇతర ప్రాంతాలకు 60 బస్సులు చొప్పున మొత్తం 270 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జ్వరంతో మహిళ మృతి

మదనపల్లె : తీవ్ర జ్వరంతో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. వడ్డిపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా ఆర్ఎంపీ వైద్యులు, మందులషాపులో మాత్రలు తెచ్చుకుని చికిత్స చేయించుకుంది. జ్వరం తగ్గకపోవడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అసలుకు భరోసా... భవిత కులాసా!

- బాలికలు, మహిళల కోసం పోస్టల్ పథకాలు
- మార్చి 31వరకు అవకాశం



మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం లోగో



సుకన్య సమృద్ధి యోజన లోగో

కడప వైఎస్సార్ సర్కిల్ : బాలికల, మహిళల ఆర్థిక పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా పొదుపు పథకాలను ప్రవేశ పెట్టింది. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. పొదుపు చేసిన సొమ్ముకు భద్రతతో పాటు ఈ రెండు పథకాలు బాలికలకు, మహిళలకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. 2025 మార్చి 31 వరకు మాత్రమే అమలులో ఉండే ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, డ్రైవ్‌లు నిర్వహించేందుకు తపాలాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పథకంలో రూ.1,000 నుంచి రూ. 2 లక్షల వరకు డిపాజిట్ అవకాశం ఉంది.

వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్‌టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా కొనసాగుతుంది. గరిష్ట మొత్తానికి రూ. 2లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశం కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండు సంవత్సరాలు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉంది. వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.

స్కీంలో చేరే విధానం..

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరే లబ్ధిదారులు ఆధార్, పాన్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసహరించుకునే అవకాశం ఉంది. ఒక వేళ డిపాజిట్‌దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసివేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి మొత్తాన్ని చెల్లిస్తారు. అవసరాన్ని బట్టి రెండు శాతం వడ్డీ తగ్గించుకొని (5.5 శాతం వడ్డీతో) ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు. కడప డివిజన్ పరిధిలో 4124 మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఖాతాలు ఉన్నాయి.

సుకన్య సమృద్ధి యోజన..

ఈ పథకంలో చేరేందుకు 10 సంవత్సరాల లోపు బాలికలు అర్హులు. కనీసం రూ.250 డిపాజిట్‌తో ఆడపిల్ల పుట్టినప్పుడు ఖాతా తెరిచి, ప్రతి నెలకు కనీసం వంద రూపాయలు నుంచి పొదుపు చేస్తే తల్లిదండ్రుల మొత్తం పెట్టుబడి రూ.18 వేలు (15 సంవత్సరాలకు)పెడితే వారికి మెచ్యూరిటీగా (21 సంవత్సరాల తర్వాత) రూ.53, 945 తపాలా శాఖ అందిస్తుంది.

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో సొమ్ము పెరిగేది ఇలా (రూ.లలో)..

డిపాజిట్	2 ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం
1,000	1,154
10,000	11,542
50,000	57,714
1,00,000	1,15,428
2,00,000	2,30,854

అవగాహన కల్పిస్తున్నాం



కడప డివిజన్ తపాలాశాఖ పరిధిలో ఇప్పటి వరకు 4124 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. 58524 మంది సుకన్య సమృద్ధి యోజనలో చేరారు. ఈ రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకాన్ని ఆడ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

-రాజేష్, తపాలాశాఖ సూపరింటెండెంట్, కడప డివిజన్

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సోమవారం భోగి (ప్రభుత్వ సెలవుదినం) పండుగ సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావద్దని ఆయన సూచించారు.

చనిపోతూ నలుగురికి ప్రాణం



గోపిరెడ్డి రాజశేఖరరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు రూరల్ : ఆయన చనిపోయినా.. నలుగురికి ప్రాణం పోశారు. గుండె, ఊపిరి తిత్తులు, కాలేయాన్ని అవసరమైన వారికి అమర్చడం ద్వారా.. ఆ నలుగురిలో బతికే ఉన్నారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన గోపిరెడ్డి రాజశేఖరరెడ్డి (55) హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జెడ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆయన మరణిస్తూ గుండె, కాలేయం, రెండు కిడ్నీలను దానం చేసి నలుగురికి ప్రాణం పోశారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గల్లంతైన బాలుడి ఆచూకీ లభ్యం



బాలుడు జస్వంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామానికి చెందిన పందిటి జస్వంత్ (7) మృతదేహం ఆదివారం లభ్యమైంది. శనివారం కేసీ చాపాడు కాలువలో జస్వంత్ గల్లంతైన విషయం తెలిసిందే. ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. పగిడాలకు చెందిన వెంకటయ్య కుమారుడు జస్వంత్ మరో ఇద్దరు పిల్లలు శనివారం బహిర్భూమికి వెళ్లారు. అయితే కాలువలో శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారి పడి నీటి ఉధృతికి కొట్టుకొని పోయాడు. దీనిపై తమ సిబ్బంది, ప్రొద్దుటూరు ఫైర్ స్టేషన్ పోలీసులు, పగిడాల గ్రామస్తుల సహకారంతో చాపాడు కాలువ వెంబడి గాలించారు. ఈ క్రమంలో మొదటి, రెండవ కమాన్‌లకు మధ్యలో కాలువలో ఉన్న కంపచెట్లలో బాలుడి మృతదేహం ఇరుక్కొని ఉండగా కనిపించింది. బాలుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

జాగ్రత్తగా చూసుకోవాలి

సంక్రాంతి సెలవులు ముగిసే వరకు తమ పిల్లలను తమ పరిరక్షణలో ఉంచుకొని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్ఐ వెంకటరమణ సూచించారు. పగిడాల గ్రామంలో బాలుడి మరణ సంఘటన దృష్టిలో ఉంచుకొని ఆయన ఈ మేరకు ప్రకటించారు.

ఏపీజీబీని అమరావతికి తరలించొద్దు

రాయలసీమ అభివృద్ధి వేదిక డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

కడప వైఎస్సార్ సర్కిల్ : రాయలసీమకు పరిశ్రమలు, సంస్థలు, ప్రాజెక్టులు ఇవ్వకుండా, ఇక్కడున్న సంస్థలను తరలించడాన్ని రాయలసీమ ప్రజలపై దాడిగా ఇక్కడి పౌర సమాజం చూస్తోందని మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు, డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కడప ఐఎంఏ హాలులో వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచి బిజినెస్, సాంకేతిక సేవలు, లాభాలు, శాఖలు ఇలా అనేక అంశాల్లో ఏపీజీబీ దేశంలోనే అగ్రగామి బ్యాంకుగా ఉందన్నారు. విలీనం తర్వాత దాని ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలనుకోవడం దుర్మార్గమన్నారు. దీనిపై మాజీ, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు ఎవరి స్థాయిలో వారు ప్రతిఘటించాలన్నారు. లేకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఏపీ ఎస్సీ ఎస్టీ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బదులు కర్నూలులో బెంచ్ పెడతామంటూ అదేదో ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని, ఇది రాయలసీమ హక్కుల నిరాకరణేనన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం, ఉపాధి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని కడపలోనే రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ నిన్నటి జగన్, నేటి చంద్రబాబు ప్రభుత్వాలు రాయలసీమ పట్ల బాధ్యతగా వ్యవహరించలేదన్నారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, గాలి చంద్ర మాట్లాడుతూ ఏపీజీబీ తరలింపుపై జరుగుతున్న అన్ని కార్యక్రమాలకు జిల్లా వ్యాప్తంగా తమ సంఘీభావం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సిటిజన్స్ ఫోరం కన్వీనర్ లక్ష్మీ రాజా, ప్రైవేట్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ నాయకుడు జోగి రామిరెడ్డి, టీఎంసీ రామాంజనేయులు, మల్లెల భాస్కర్. ఆర్‌సీపీ అనంతపురం జిల్లా కార్యదర్శి అక్బర్, పుట్టపర్తి జిల్లా కార్యదర్శి గంగాధర, వివిధ ప్రజా సంఘాల నాయకులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, నాగ సుబ్బారెడ్డి, మగ్బూల్,శ్రీనివాస్, అయ్యవారు రెడ్డి, అజీజ్, జగదీష్, ప్రసన్న, సుదర్శన్, శివశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సరిహద్దులో రోడ్డుప్రమాదం



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ప్రకాష్



ప్రకాష్ (ఫైల్)



మారుతీశివకుమార్(ఫైల్)

- ఇద్దరి మృతి
- ముగ్గురికి గాయాలు
- మృతులు కడప, తిరుపతి వాసులు

మదనపల్లె : ఏపీ, కర్ణాటక సరిహద్దులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, కడపకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి గోవిందరాజస్వామి గుడి వీధికి చెందిన పర్వతరెడ్డి ప్రకాష్(55) తిరుపతి టౌన్‌బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. బెంగళూరులోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు తన బంధువైన కడప ప్రకాష్‌నగర్‌కు చెందిన టీచర్ మారుతీ శివకుమార్(61)తో కలిసి కారులో బెంగళూరుకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం బెంగళూరు నుంచి తిరిగి వస్తుండగా, ఏపీ, కర్నాటక సరిహద్దు ప్రాంతం రాయల్పాడు సమీపంలో ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొంది. ప్రమాదంలో కడపకు చెందిన టీచర్ మారుతీశివకుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కొన ఊపిరితో ఉన్న టౌన్ బ్యాంక్ మేనేజర్ ప్రకాష్‌ను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇదే వాహనంలో వీరితో పాటు ప్రయాణిస్తున్న మరోవ్యక్తి ఆనంద్ తీవ్రంగా గాయపడగా, బాధితుడిని మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు.

కాగా, మరో వాహనంలోని ఇద్దరు వ్యక్తులు గాయపడగా వారిని శ్రీనివాసపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాయల్పాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతికి చెందిన ప్రకాష్‌కు భార్య అరుణ, కుమారుడు కుశాల్(12) ఉన్నారు. కడపకు చెందిన టీచర్ మారుతీ శివకుమార్‌కు భార్య శ్రీవాణి, కుమారుడు పవన్, కుమార్తె యశస్వి ఉన్నారు.

సర్వే చేయకుండానే రోడ్డు నిర్మాణం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ ఎదురుగా బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ప్రైవేటు భూమి ఉందని తెలిసినా సర్వే చేయకుండా అధికారులు రోడ్డు నిర్మాణానికి అత్యుత్సాహం చూపారు. దీనికి తోడు జిల్లా కలెక్టర్ రోడ్డు నిర్మాణ స్థలం సర్వే జరిపి నివేదిక పంపాలని ఆదేశించినా అధికారులు, కూటమి నాయకులు, కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. అలాగే పనులు చేస్తుండడంతో భూ యజమాని సురేష్‌కుమార్ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పంచాయతీరాజ్ చట్టప్రకారం యజమానులకు నోటీసులు ఇచ్చి సర్వే జరపాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ కూటమి నాయకుల మాటలు వింటూ అధికారులు కాంట్రాక్టర్‌ను రోడ్డువేయమని ప్రోత్సహించడంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి.



రోడ్డు నిర్మిస్తున్న స్థలం

గడికోటకు చింతల శ్రీరాములరెడ్డి సేవలు మరువలేనివి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



చింతల శ్రీరాముల రెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

వీరబల్లి : మండలంలోని గడికోట ప్రాంతానికి చింతల శ్రీరాములు రెడ్డి అందించిన సేవలు మరువలేనివని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతల శ్రీరాముల రెడ్డి కుమారులు మాజీ హైకోర్టు న్యాయమూర్తి సీవీ నాగార్జున రెడ్డి, అడ్వకేట్ పవన్ కుమార్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఎడబల్లి మెయిన్ రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన చింతల శ్రీరాముల రెడ్డి విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ అడ్వకేట్ జనరల్ చింతల మోహన్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాముల రెడ్డి ఒక గ్రామ నాయకుడిగా ప్రజల ఆదరణ పొందడమే కాకుండా ఆయన మారుమూల గ్రామమైన గడికోట ప్రాంతానికి అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల గుండెల్లో నేటికీ నిలిచిపోయారని కొనియాడారు. చీకటిలో ఉన్న గడికోట గ్రామానికి విద్యుత్ తీసుకువచ్చిన ఘనత ఆయనదే అన్నారు. గడికోట ప్రాంతం నుంచి మంటపంపల్లి వరకు తారురోడ్డు నిర్మించేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే గడికోట గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి, కడప జిల్లాలకు సంబంధించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, మండల స్థాయి అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తనలు



తాళ్లపాకలో అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న వెంకటేశ్వర్లు కోటపాటి గోవిందదాసా

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో ఆదివారం అన్నమయ్య సంకీర్తనల దళితుల జనజాతర ఆద్యంతం ఆకట్టుకుంది. ధ్యానమందిరం ఆవరణంలో వేదికపై శ్రీ అన్నమాచార్య సంకీర్తన స్వరవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్(రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ (విజయవాడ)సహకారంతో వెంకటేశ్వర్లు కోటపాటి గోవింద దాసా వారి సారథ్యంలో అన్నమాచార్య సంకీర్తనల కార్యక్రమం నిర్వహించారు. కొలని దొపరికి గొబ్బిళ్లో యదుకుల స్వామికి గొబ్బిళ్లో అనే చరిత్రాత్మక కార్యక్రమం నిర్వహించారు. 32 అన్నమయ్య సుప్రసిద్ధ సంకీర్తనలతో 32 దళిత జానపద కళారూపాలతో అన్నమయ్య సంకీర్తనల దళితులు జనజాతర కార్యక్రమం కొనసాగించారు. అనంతరం జానపద, కోలాటం, గొబ్బెమ్మ, తదితర గురువుల ప్రదర్శన అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి నృత్యప్రదర్శన సహకారం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తాళ్లపాకకు చెందిన గ్రామస్తులు జువ్వాది మోహన్, భక్తులు, కళాభిమానులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి




రాయచోటిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

రాయచోటి (జగదాంబసెంటర్) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అమిత్‌షా అవమానించగా బీజేపీ ఎంపీలు నవ్వడం సిగ్గు చేటన్నారు. దేశంలో ప్రజలు సగౌరవంగా బతుకుతున్నారంటే రాజ్యాంగం కల్పించిన హక్కు వల్లే అన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజల జీవితాలలో అంబేద్కర్ వెలుగులు నింపారన్నారు. అంటరానితనం నిర్మూలనపై అంబేద్కర్ జీవితకాలం పోరాటం చేశారని అందుకే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అంబేద్కర్ జపం చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ అమీర్, సల్మాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మన్సూర్ అలీఖాన్, దర్బార్ బాషా, చెన్నకృష్ణ, మంజునాథ, బాబా సర్దార్, మహమ్మద్‌రఫీ, రియాజ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలిపటాల ఎగురవేతలో జాగ్రత్తలు అవసరం

విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ





విద్యుత్ లైన్లకు చిక్కుకున్న గాలిపటం

కడప కార్పొరేషన్ : గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రమణ సూచించారు. ఆదివారం విద్యుత్ భవన్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో పెద్దలు వారి వెంట ఉండి విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిద్దెలపై నుంచి గాలి పటాలు విద్యుత్ లైన్లకు దూరంగా ఎగరవేయాలన్నారు. ఒకవేళ విద్యుత్ లైన్లకుగానీ, ట్రాన్స్‌ఫార్మర్లకుగానీ గాలిపటాలు తగులుకుంటే వాటిని తీసే ప్రయత్నం చేయరాదన్నారు. అలా చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న జన సాంద్రతతో పాటు స్థల వ్యయం తదితర కారణాల వల్ల విద్యుత్ సంస్థ ఎన్నిసార్లు హెచ్చరించినా ఇంటి నిర్మాణాలు లైన్లకు దగ్గరగా చేస్తున్నారని, అందువల్ల విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలన్నారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి



పశువుల షెడ్లను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : పాడి పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె, గుంటిమడుగులో నూతనంగా పశువుల షెడ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గానికి 300 షెడ్లు మంజూరయ్యాయని చెప్పారు. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

సిమెంట్ రోడ్లు ప్రారంభం : రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట, కురవపల్లెలలో సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి

పెద్ద తిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లెకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త మస్తానమ్మ ఆమె భర్త నరేంద్ర, బావ నాగరాజుపై ఆదివారం రాళ్లు, కర్రలతో ప్రత్యర్థులు దాడులు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన గంగులప్ప, శీన, వెంకటరమణ, నరేంద్ర, వెంకటమ్మ, నరసమ్మ, అమరావతి పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై..

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం జగనన్న కాలనీలో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు జగనన్న కాలనీకి చెందిన ఆర్.చంద్రశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి సిమెంట్ బస్తాల విషయంలో దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడికేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె : దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ....ఈ నెల 10వ తేదీన ఈశ్వరమ్మకాలనీలో గోనె సంచుల వ్యాపారం చేసుకునే నారాయణ(37)పై, బుగ్గకాలువకు చెందిన జగదీష్ డబ్బులు ఇవ్వనందుకు కత్తితో దాడిచేసి గాయపరిచాడన్నారు. దాడిలో నారాయణ చేయి అడ్డుపెట్టగా, చేతిపై తీవ్రగాయాలై బాధితుడు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు జగదీష్‌ను ఆదివారం అరెస్ట్ చేశామన్నారు.